క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ /వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 15, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 40, కాకర 38, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 11, క్యారెట్ 15, దొండ 35, ఆలు 18, ఉల్లి 14, గోకర 45, దోస 28, సొర 11, పొట్ల 13, అరటి 10, చిక్కుడు 55, అర్వి 55, మునగ 28, చిలగడదుంప 35, బీట్‌రూట్ 17, కీర 15, ఫ్రెంచ్ బీన్స్ 65, క్యాప్సికమ్ 45 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శుక్రవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ఎల్‌బీనగర్: అభివృద్ధి పనులను చేసే కాంట్రాక్టర్లు ఆయా పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పక పాటించేలా చూడాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అధికారులను ఆదేశించారు. సాహెబ్‌నగర్ పాత గ్రామంలో గురువారం రాత్రి సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన విషయాన్ని తెలుసుకున్న ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో కాలనీవాసులు భాగస్వాములైతే పనులు మరింత నాణ్యతగా ఉంటాయన్నారు. బస్తీ నేతలు శ్రీనివాస్, దుర్గాప్రసాద్, నవీన్, ఆదర్శ్, రవికుమార్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

'శోభా'యమానం



శోభాయాత్రను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా గురువారం మూసారంబాగ్‌లో చేపట్టిన శోభాయాత్రను ఆమె ప్రారంభించారు. సాయినగర్ కాలనీ పోచమ్మ టెంపుల్ నుంచి మొదలైన శోభాయాత్ర శాలివాహననగర్, దిల్‌సుఖ్‌నగర్, మూసారంబాగ్ చౌరస్తా, సలీంనగర్ మీదుగా మూసారంబాగ్ రామాలయం వరకు కొనసాగింది. నాయకులు సందడి సురేందర్‌రెడ్డి, నర్సింహ, దేవేందర్, మధుసూదన్‌రెడ్డి, విజయకాంత్, తిరుమల్‌రెడ్డి, మురళీ, కొప్పుల దినేష్, భరత్, రంజిత్, రవీందర్ పాల్గొన్నారు.

చలివేంద్రాలతో దాహార్తికి చెక్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

మలక్‌పేట: వేసవిలో పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతోగానో ఉపకరిస్తాయని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ కసపరాజు శ్రీనివాస్ అన్నారు. మూసారంబాగ్ ఆండాళ్ నిలయం ఎదురుగా ఉన్న లోకల్ బస్టాప్ వద్ద రిందాకృప సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఇన్‌స్పెక్టర్ ప్రారంభించారు. రిందాకృప ఫౌండర్ రూపాదేవి, లక్ష్మీదేవి, రామకృష్ణ, రిందాకృప పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



సదరం సర్టిఫికెట్‌లు అందజేస్తున్న షఫీయుద్దీన్

చాదర్‌ఘాట్: దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని ఎంఐఎం పార్టీ ఓల్డ్‌మలక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు షఫీయుద్దీన్ తెలిపారు. గురువారం పార్టీ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పలువురు దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షఫీయుద్దీన్ మాట్లాడుతూ... దివ్యాంగులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తున్నామన్నారు. నెలకు ఒకసారి కార్యక్రమాన్ని నిర్వహించి దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు, ప్రభుత్వ పథకాలు అందేలా ఎంఐఎం తరఫున కృషి చేస్తామన్నారు.

సినీ హీరో నాని, కీర్తిసురేష్ సందడి

చిక్కడపల్లి: శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందించిన దసరా చిత్రం గురువారం విడుదలైన సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సుదర్శన్ థియేటర్ వద్ద హీరో, హీరోయిన్ నాని, కీర్తి సురేష్ సందడి చేశారు. ప్రేక్షకులతో కలసి సినిమాను తిలకించారు. థియేటర్‌లో తన నటన, పాటలకు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూసి వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు. నాని, కీర్తిసురేష్‌లను చూసేందుకు అభిమానులు అధిక సంఖ్యలో రావడంతో థియేటర్ వద్ద సందడి నెలకొంది.

నయనానందకరం..
రాములోరి కల్యాణం



ఆర్‌కేపురం అష్టలక్ష్మి ఆలయంలో తాళిని చూపుతున్న పండితుడు

శ్రీరామనవమి పర్వదినాన్ని ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో గురువారం వేడుకగా నిర్వహించుకున్నారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన దేవాలయాలు, కల్యాణ మండపాల్లో సీతారాముల వారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసి, అన్నదానం చేశారు.

– దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్ జోన్ బృందం



ఆర్‌కేపురంలోని అష్టలక్ష్మి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ ఆలయంలో సీతారామ కల్యాణోహోత్సవానికి పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



సైదాబాద్‌లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు



మన్సూరాబాద్‌లో ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, సినీనటులు జీవిత, రాజశేఖర్



నాగోలులో ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా



వనస్థలిపురం జనప్రియ హోమ్స్‌లో...



చైతన్యపురి కాలనీలో కాంగ్రెస్ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి



విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో...



జైపురి కాలనీలోని భాగ్య ఎన్‌క్లేవ్‌లో...



హయత్‌నగర్‌లో...



మన్సూరాబాద్ హనుమాన్ ఆలయంలో...



అయ్యప్ప ఆలయంలో కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి



ఎన్‌కేడీ రామాలయంలో సీతారామ కల్యాణ వేడుకలో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి



కల్యాణోత్సవంలో కాంగ్రెస్ నేత దేప భాస్కర్‌రెడ్డి తదితరులు



ఉప్పరిగూడలో పూజలు నిర్వహిస్తున్న డీసీపీ రూపేష్



కుర్మగూడ హనుమాన్ ఆలయంలో కల్యాణోత్సవం



శాలివాహననగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో...



సాహెబ్‌నగర్ కాలనీలో మాజీ కార్పొరేటర్ రామ్మోహన్‌గౌడ్



మలక్‌పేట హరిహర క్షేత్రంలో స్వామివారి పల్లకీ సేవలో భక్తులు



మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో పాలకవర్గ సభ్యులు



కర్మన్‌ఘాట్‌లోని శుభోదయ కాలనీలో...

'ఇప్టా' జాతీయ కార్యదర్శి నర్సింహాకు సన్మానం



నర్సింహాను సన్మానిస్తున్న సీపీఐ నేతలు

నాగోలు: ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ అసోసియేషన్ (ఇప్టా) జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన పల్లె నర్సింహాను గురువారం నాగోలులో పలువురు ఘనంగా సన్మానించారు. తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన ప్రసుత్తం ఎల్‌బీనగర్‌లో ఉంటున్నారు. ఎల్‌బీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ... సాంస్కృతిక, కళా రంగాలకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కేంద్ర రాష్ట్ర స్థాయిలో స్పష్టమైన సంస్కృతి విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు మానవీయ విలువలు నేర్పించాలి



రామంతాపూర్: ఇందిరానగర్‌లోని ప్రతిభ విద్యానికేతన్ హైస్కూల్లో గురువారం నిర్వహించిన వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుబాష్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు మానవీయ విలువలు నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ గాదె సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయురాలు ప్రియాంక, ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీసరస్వతి విద్యా పీఠం ఆవిర్భావ దినోత్సవం

కాచిగూడ: నింబోలిఅడ్డాలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో గురువారం శ్రీ సరస్వతి విద్యాపీఠం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులకు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయలు నేర్పించాల్సిన అవసరం స్కూల్లో ఉపాధ్యాయులతో పాటు పిల్లల తల్లిదండ్రుల పైన ఎంతైనా ఉందని స్కూల్ హెచ్‌ఎం వాణి అన్నారు. శ్రీ రామనవమి సందర్భంగా చిన్నారులు సీతారాముల వేషధారణలో అలరించారు. ఉపాధ్యాయురాళ్లు వనజ, సావిత్రీ, మీనా, యమున తదితరులు పాల్గొన్నారు.

కెన్యాలో తేనెటీగల దాడిలో నగరవాసి మృతి



బ్రహ్మాచారి (ఫైల్)

ఉప్పల్: కెన్యాలో జరిగిన తేనె టీగల దాడిలో నగరానికి చెందిన ఓ వ్యక్తి మృతిచెందాడు. మృతుడి సోదరుడు జితేంద్రాచారి తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా ఖానాపుర మండలం ధర్మారావుపేటకు చెందిన పడకంటి బ్రహ్మాచారి(55) దంపతులు ఉప్పల్‌లోని కావేరినగర్‌లో నివాసముంటున్నాడు. మూడేళ్ల క్రితం కెన్యా దేశంలోని టాంజనియా రాష్ట్రంలో వ్యవసాయం చేయడానికి వెళ్లాడు. అక్కడ వ్యవసాయ క్షేత్రాలను లీజుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పంట చేలలో పనులు చేస్తుండగా ఒక్కసారిగా బ్రహ్మాచారిపై తేనె టీగలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ భారత కాలమాన ప్రకారం గత సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. బ్రహ్మాచారికి ఇద్దరు కుమార్తెలు శ్రుతి, శ్రావిక ఉన్నారు. పెద్ద కూతురు శ్రుతికి వివాహం అయ్యింది. వచ్చే సోమవారం ఉప్పల్‌కు బ్రహ్మాచారి మృతదేహాన్ని తీసుకురానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



మల్కాజిగిరి: వృద్ధుడు అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మల్లికార్జుననగర్‌కు చెందిన బొండ్ల ప్రకాష్ జిరాక్స్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 30న తెల్లవారుజామున ప్రకాష్ తల్లిదండ్రులు అయోధ్య టూర్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చారు. కొద్ది సేపటి తర్వాత బయటకు వెళ్లిన ప్రకాష్ తండ్రి నర్సింహ(75) ఇంటికి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఆక్రమించుకుని నిర్మాణం



చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ మున్సిపల్ కాలనీలో కరెంటు స్తంభాన్ని ఆక్రమించుకొని ఓ వ్యక్తి ఇంటి నిర్మాణాన్ని చేపట్టాడు. ఆయన స్థలాన్ని ఆనుకునే విద్యుత్ స్తంభం ఉంది. ఆ కాలనీలో 10 అడుగులలోపే రహదారులు ఉన్నాయి. ఇప్పుడు ఆ రోడ్డుతో పాటు విద్యుత్ స్తంభం తన ఇంట్లోకి వచ్చేలా చేపట్టిన నిర్మాణంపై కాలనీవాసులు సదరు ఇంటి యజమానిని నిలదీశారు. అయినా దాన్ని పట్టించుకోకుండా స్లాబ్‌లు వేసి నిర్మాణం కొనసాగిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి నిర్మాణాన్ని ఆపాలని వారు కోరుతున్నారు.

పోచమ్మకు మకర తోరణం సమర్పణ



మన్సూరాబాద్: నాగోలు డివిజన్‌లోని డబుల్‌బెడ్ రూం సముదాయాల్లోని ఉన్న గాలి పోచమ్మ ఆలయంలో అమ్మవారికి మకరతోరణాన్ని జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జక్కిడి రఘువీర్‌రెడ్డి గురువారం సమర్పించారు. బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నేతలు నర్రి వెంకన్న, సిద్దగొని జగదీష్‌గౌడ్, అంజయ్య, ఎర్పుల యాదయ్య, సాయిగౌడ్, రవియాదవ్, నరేష్, కాశీగౌడ్, వెంకన్న, శివశంకర్‌రెడ్డి, దుర్గారావు, క్రాంతి పాల్గొన్నారు.

ఇద్దరు చిన్నారులపై వీధి కుక్కల దాడి



బాలుడి కాలిపై గాయాలు

మల్లాపూర్: ఆరు బయట ఆడుకుంటున్న ఓ బాలుడు, బాలికపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటన గురువారం నాచారంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నాచారం రాఘవేంద్రనగర్‌కు చెందిన రష్మిక (04), ఇందిరానగర్‌కు చెందిన ఆదర్శ్(11) సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడిచేసి కాళ్లు, చేతులపై కరిచాయి. చికిత్సం నిమిత్తం వారిని నాచారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. రాఘవేంద్రనగర్, ఇందిరానగర్ కాలనీల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, దీంతో భయాందోళనకు గురవుతున్నామని స్థానికులు చెబుతున్నారు.